RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

ఆది వారం
26-03-2023
సంపుటి - 08,
సంచిక - 280
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ


# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## కెటిఆర్ రాజీనామా చేయాలి



- లేదంటే బర్తరఫ్ చేయాలి
- నిరుద్యోగులకు పరిహారం చెల్లించాలి
- మహాధర్నాలో బండి సంజయ్ డిమాండ్

**హైదరాబాద్, మార్చి 25 (సమసమాజం):** టీఎస్ పీఎస్ సీ పేపర్ లీకేజీ కేసులో అసలు నిందితులెవరో తేల్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ డిమాండ్ చేశారు. దోషలును తేల్చడంతో పాటు, కెటిఆర్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను మరోమారు తెర మీదకు తెచ్చారు. అదే సందర్భంలో నిరుద్యోగులకు కనీసం లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలన్న డిమాండ్ చేస్తున్నారు. ఇందిరాపార్క్ వద్ద బీజేపీ నిరుద్యోగ మహాధర్నాలో పాల్గొన్న బండి సంజయ్.. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పేపర్ లీక్ కేసులో విచారణ జాప్యం చేస్తూ నిందితులను కాపాడే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని .. లేకపోతే భర్తరఫ్ చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. సిట్టింగ్

2వ పేజీలో...

### బండి సంజయ్‌కు మారోమారు నోటీసులు

లీగల్‌గా చర్చిస్తామన్న బండి సంజయ్

బండి సంజయ్‌కు మరోసారి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇంటికి శనివారం ఉదయం సిట్ అధికారులు చేరుకున్నారు. ఆదివారం విచారణకు హాజరు కావాలని సిట్ ఆదేశాలు జారీ చేసింది. అయితే సిట్ నోటీసులపై స్పందించిన బండి సంజయ్.. విచారణకు హాజరుకావాలా.. లేదా అనే అంశంపై తమ లీగల్ టీంతో చర్చించి నిర్ణయం తీసుకుంటానన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలనే డిమాండ్ కు కట్టుబడి ఉన్నానని తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ కేసులో నమ్మలేని నిజాలున్నాయన్న తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు

# మునుగోడు కాంగ్రెస్‌లో మారని తీరు !

## డమ్మీ ఇంఛార్జీగా చల్లమల్ల చలామణి

నాటి గ్రూపు రాజకీయాలకు పునర్జీవం పోస్తున్న క్రిష్ణారెడ్డి

మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీ పాల్వాయి శ్రావంతిని ఇరుకున పెట్టే ప్రయత్నం



గత మునుగోడు ఉపఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ రెండు వర్గాలుగా ఉండేది. ఒక వర్గం రాజగో పాల్‌రెడ్డిది మరో వర్గం పాల్వాయి శ్రావంతిది. రాజగోపాల్‌రెడ్డి దగ్గర ఉన్న డబ్బు కోసం సన్నాయి నొక్కుళ్లు నొక్కుతు జేజేలు కొట్టేవారు. అయితే పాల్వాయి శ్రావంతి వర్గం మాత్రం ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలుగా కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతగా పని చేసేవారు అని చెప్పుకు ంటారు. రాజగోపాల్‌రెడ్డి బీజేపీ పార్టీలోకి వెళ్ళిన తరువాత పాల్వాయి శ్రావంతికి తిరుగులేదు అనుకునే క్రమంలో.. ఆ స్థానంలో చల్లమల్ల క్రిష్ణారెడ్డి చేరారు. తరుచు గ్రూపు రాజకీయాలకు పాల్పడే రాజగోపాల్‌రెడ్డికి దూరంగా ఉన్న పాల్వాయి శ్రావంతి.. రాజగోపాల్‌రెడ్డి బీజేపీకి వెళ్ళిన తరువాత లైన్‌క్లియర్ అయింది అనుకున్న తరుణంలో చల్లమల్ల క్రిష్ణారెడ్డి వచ్చి మునుగోడు కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను తన వైపు తిప్పుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు, చేస్తున్నారు. ఎంతలా అంటే మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీని నీనే అనే అంతలా వ్యవహరిస్తూ.. ఒంటెద్దు పోకడపోతున్నాడు అనే ఆరోపణలు ఉన్నాయి. జరుగుతున్న పరిణామాల దృష్ట్యా క్యాడర్‌లో అయోమయం మొదలైంది. చల్లమల్ల క్రిష్ణారెడ్డి ఒంటెద్దు పోకడతో పాల్వాయి శ్రావంతిని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నాడు రాజ గోపాల్‌రెడ్డి నికృష్ణ రాజకీయలతో ప్రజలు విసుకెత్తిపోయారు. గ్రూపు రాజకీయాలతో పాల్వాయి శ్రావంతిని ఇరుకున పెట్టారు. ఇప్పుడు కూడా క్యాడర్‌లో చీలికలు పున.ప్రా రంభం అవుతున్నాయి. తద్వారా మునుగోడు కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం కలుగే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఊరూరా ఫ్లెక్సీలతో, క్షేత్ర స్థాయి కార్యకర్తలకు నజరానాలు ప్రకటిస్తూ ధన రాజకీయాలకు తెరలేపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కరుడుకట్టిన కాంగ్రెస్ కార్యకర్తలు ఢిల్లీ మీటింగ్‌లో పాల్గొనేందుకు వెళ్లాలని సంప్రదించగా.. పార్టీ కోసం కాదు నా కోసం పని చేయండి అంటూ తన కుటిల బుద్ధిని బయట పెట్టుకున్నారని సదరు కార్యకర్త చెప్పటం చూస్తే తన స్వార్థ రాజకీయాలేంటో ఇట్లే అర్థమౌతున్నాయి. కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ రూపంలో బగ్గ సంపాదించిన కిష్ణారెడ్డి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బీఫామ్ తెచ్చుకునేందుకు తహతహలాడుతు న్నారు. సహజంగానే రేవంత్ వర్గంగా చెప్పు కునే క్రిష్ణారెడ్డి.. వచ్చే ఎన్నికల్లో బీఫామ్ సులువౌతుందని ఆశాభావం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికి కండ్లు నెత్తికెక్కినట్లు ప్రవర్తించే రాజగోపాల్‌రెడ్డికి డబుల్ యాక్షన్ కింగ్‌లా కనిపించే క్రిష్ణారెడ్డి అత్యుత్సాహం.. తన రాజకీయ జీవితంకు మచ్చ ఏర్పడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తు న్నారు.

*సమ సమాజం ప్రత్యేక కథనం*

రేపటి సంచికలో

# ప్రజల కోసం జైలుకు వెళ్లడానికి సిద్ధమే



- ఆదానీ, మోడీ బంధంపై నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటా
- ఆదానీ షెల్ కంపెనీలకు కోటాది రూపాయులు ఎలా వచ్చాయి
- చైనా కంపెనీలు ఎలా పెట్టుబడులు పెట్టగలిగాయి
- లోక్‌సభలో మాట్లాడకుండా అడ్డుకున్నారు
- అనర్వృత వేటు తర్వాత తొలిసారిగా మీడియా ముందుకు రాహుల్

**న్యూఢిల్లీ, మార్చి 25 (సమసమాజం):** అదానీ షెల్ కంపెనీలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అలాగే ప్రజల కోసం జైలుకు వెళ్లడానికి కూడా వెనకాడనని అన్నారు. అదానీ వ్యవహారాన్ని తాను ప్రశ్నిస్తూనే ఉంటానని రాహుల్ గాంధీ చెప్పారు. అనర్హత వేటు వేసినా..జైల్లో వేసినా..కొట్టినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. అదానీ ఇష్యూను డైవర్ట్ చేయడానికే తనపై అనర్హత వేటు వేశారని చెప్పారు. అనర్హత వేటు తర్వాత తొలిసారిగా మీడియా ముందుకు వచ్చిన ఆయన..అదానీ కంపెనీల్లో ఎవరు పెట్టుబడి పెట్టారో చెప్పాలన్నారు. అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన షెల్ కంపెనీలు డిఫెన్స్ సెక్టార్‌తో ముడిపడి ఉన్నాయి. ఒక చైనా జాతీయుడికి కూడా ఈ పెట్టుబడులతో లింక్ ఉంది. అందుకే ఆ పెట్టుబడుల వివరాలేంటో చెప్పాలని అడిగాను. ప్రజల్లోనే ఉంటాను.. భారత్ జోడో యాత్రలో ప్రజల్లోకి వెళ్లాను. నేను భారత దేశ ప్రజాస్వామ్యం కోసం పోరాడాను. పోరాడుతూనే ఉంటానని ప్రకటించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వ్యక్తినే అయితే నాకు మాట్లాడే

2వ పేజీలో...

### ఇక దేశమంతా రాహుల్ గొంతుకను వినిపిస్తుంది

రాహుల్ ప్రశ్నలను ప్రజలు ప్రశ్నిస్తుంటారు: ప్రియాంక ట్వీట్



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలు ఇక దేశమంతా ప్రతిధ్వనిస్తాయని ఆయన సోదరి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ప్రకటించారు. ట్విటర్ వేదికగా శనివారం ప్రియాంక ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రజల గొంతుకను అణిచివేయడం సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. పార్లమెంట్ కార్యకలాపాలకు సంబంధించిన వీడియోను ఆమె పోస్టు చేస్తూ..ఈ ప్రశ్నలు వేసినందుకే రాహుల్ గాంధీపై దాడి చేశారని ఆమె రాసుకొచ్చారు.

## ఎల్‌బీ నగర్ చౌరస్తాకు శ్రీకాంతాచారి పేరు

ఫ్లై ఓవర్‌కు మాల్ మైసమ్మగా నామకరణం

ఎల్బీనగర్ చౌరస్తాలో రెండో ఫ్లై ఓవర్ ప్రారంభించిన కెటిఆర్



**హైదరాబాద్, మార్చి 25 (సమసమాజం):** తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారిపేరును ఎల్‌బీ నగర్ చౌరస్తా కు నామకరణం చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. అలాగే ఎల్బీనగర్ వద్ద ప్రారంభించుకున్న ఫ్లై ఓవర్‌కు మాల్ మైసమ్మ అని నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రెండు, మూడు రోజుల్లోనే జారీ చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఎల్‌బీ నగర్ ఆర్‌హెచ్‌ఎస్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ఎస్ఆర్‌డీపీ కింద ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో మొత్తం 12 పనులను రూ. 650 కోట్లతో చేపట్టామని కేటీఆర్ తెలిపారు. ఈ ఫ్లై ఓవర్ 9వ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఇంకా మూడు ప్రాజెక్టులు మిగిలి ఉన్నాయి.. బైరామల్‌గూడలో సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్, రెండు లూప్‌లను సెప్టెంబర్ నాటికి పూర్తి చేస్తాం. ఈ పనులను పూర్తి చేసిన తర్వాతనే ఎన్నికలకు వెళ్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎల్‌బీ నగర్ చౌరస్తా దాటాలంటే గతంలో 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టేదని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు ఫ్లై ఓవర్ ఓవర్లు, అండర్ పాస్‌లు అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ ఇబ్బంది లేదు. ఈ ఫ్లై ఓవర్లు మాత్రమే కాదు.. ప్రజా రవాణా మెరుగుపడల్సిన అవసరం ఉంది. మళ్లీ రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే. తప్పకుండా నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రోను తీసుకువస్తాం. హయత్‌నగర్‌కు కూడా విస్తరిస్తాం. ఎయిర్‌పోర్టు వరకు కూడా మెట్రోను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాం. గడ్డి అన్నారం మార్కెట్‌లో వెయ్యి పడకల టిమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. రాబోయే సంవత్సరన్నర కాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం అని వివరించారు. జీవో నంబర్ 118 కింద దశబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చొరవతో పరిష్కరించుకున్నాం.

2వ పేజీలో...

## రెండో రోజూ కాంగ్రెస్ నేతల గృహనిర్బంధం

రేవంత్ ఇంటి వద్ద పోలీసుల మొహరింపు



**హైదరాబాద్, మార్చి 25 (సమసమాజం):** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్‌నకు సంబంధించి ఓయూ విద్యార్థుల కు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ నేతలను రెండో రోజు కూడా పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నేతలను హౌజ్ అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం కూడా అదే తీరును కొనసాగిస్తున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌ను గృహనిర్బంధం చేశారు. అలాగే టీపీసీసీ చీఫ్ రేవంత్ ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించారు. నిరుద్యోగ మహాదీక్షకు రేవంత్ హాజరుకావడంపై రేవంత్ ఇంటి వద్ద టెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది. దీక్షకు ముఖ్య అతిథిగా హాజరై రేవంత్ సంఘీభావం తెలపాలని టీపీసీసీ చీఫ్ నిర్ణయించారు. అయితే ఈ దీక్షకు అనుమతి లేదంటూ.. రేవంత్ ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్ళకుండా పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. రేవంత్ ఇంటికి వెళ్లే దారులన్నీ మూసేశారు. రేవంత్ ఇంటికి ఎవరూ రాకుండా పోలీసులు అడ్డుకున్నారు.

## ఇస్రో మరో భారీ ప్రయోగం

నేడు క్షక్షలోకి ఎల్వీఎం-3 రాకెట్



**బెంగళూరు,మార్చి25(సమసమాజం):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో భారీ రాకెట్ ప్రయోగానికి సిదమైంది. శాస్త్రవేత్తలు 26న ఆదివారం షార్ నుండి ఎల్వీఎం-3 రాకెట్ ను ప్రయోగించనున్నారు. ఎల్‌వీఎం-3 వాహకనౌక ద్వారా 36 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు కౌంట్ డౌన్ మొదలైంది. గురువారం నిర్వహించిన రిహార్సల్స్ విజయవంతం అయ్యాయి. దీంతో ఆదివారం ఉదయం ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. మొదటి విడతలో 36 ఉపగ్రహాలను గతేడాది అక్టోబరు 23న ఇస్రో విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. తాజాగా 36 ఉపగ్రహాలను ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపనున్నారు. 5,805 కేజీలు బరువు కలిగి ఉన్న 36 ఉపగ్రహాలను 450 కి.మీ. ఎత్తులో ఉన్న లో ఎర్త్ ఆర్బిట్ లోకి పంపనున్నారు. 36 వన్ వెబ్ ఉపగ్ర హాలతో కూడిన మొదటి బ్యాచ్‌ను గత ఏడాది అక్టోబర్ 23 న శ్రీహరి కోట నుండి విజయవంతంగా ప్రయోగించి ంది.

## రాహుల్‌పై అనర్హత వేటు దారుణం

బొమ్మలరామారంలో కోమటిరెడ్డి నిరసన



**భువనగిరి, మార్చి 25 (సమసమాజం):** రాహుల్ గాంధీపై అనర్హత వేటు చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని.. న్యాయం కోసం పోరాటం చేస్తామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయటాన్ని నిరసిస్తూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమని వ్యాఖ్యానించారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. భారత్ జోడో

2వ పేజీలో...

## సంపాదకీయం

# ప్రజాస్వామ్యం ఇప్పుడే ప్రమాదంలో పడిందా ?



పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న ఆరోపణలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రధానం గా రాజకీయ పార్టీలు ఈ విషయంలో గగ్గోలు పెడుతున్నాయి. రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష పడడం.. వెంటనే లోక్‌సభ చర్యలు తీసుకుని ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయడం చకచకా జరిగిపోయింది. దీనికి ముందే ఇడి, సిబిఐ దాడులపై 16 పార్టీల బృందం సుప్రీంలో ఓ కేసు వేసింది. ఈ కేసు వేసిన వారిలో ఆయా రాష్ట్రాల్లో అధికారం వెలగబెడుతున్న వారు..వెలగబెట్టిన వారు కూడా ఉన్నారు. వీరంతా తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూనే..కేంద్రాన్ని దుమ్మెత్తి పోస్తున్నారు. నిజానికి కేంద్రంలోని బిజెపి అయినా..రాష్ట్రాల్లో పాలన చేస్తున్న ప్రాంతీయ పార్టీలైనా ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేయడం లేదన్నది నూటికినూరుపాళ్లు నిజం. ఈ విషయాన్ని దేశం, ప్రపంచం గమనించినా..ఈ పార్టీల వారు మాత్రం అంగీకరించడం లేదు. న్యాయం అన్నది రాష్ట్రానికోటి..దేశానికోటి ఉండదని ఆయా పార్టీల నేతలు గుర్తించాలి. ఈ క్రమంలో రాహుల్‌పై వేటు పడడంతో మరోమారు గ్గోలు పెడుతున్నారు. నిజానికి రాహుల్ గాంధీ పలు సందర్భాల్లో తన వాచాలత్వాన్ని చాటుకున్నారు. పదేళ్ళ యూపిఎ పాలనలో తీసుకుని వచ్చిన చట్టమే ఇప్పుడు ఆయన మెడకు చుట్టు కుంది. లాలూ ప్రసాద్ కోసం నాటి ప్రధాని మన్మోహన్ తెచ్చిన ఆర్డినెన్స్‌ను రాహుల్ చింపిపడేశారు. దీంతో నాటి మన్మోహన్ ప్రభుత్వం దానిని వెనక్కి తీసుకుంది. అదే ఇప్పుడు రాహుల్ మెడకు చుట్టుకుంది. మొత్తంగా ఈ అవకాశాన్ని బిజెపి బాగా ఉపయోగించుకుని.. రాహుల్ మెడకు చుట్టేసింది. అయితే ఇక్కడ ఓ విషయం మాత్రం అందరూ గుర్తించాలి. ఇది ఒక్క రాహుల్‌కే వర్తించదు. అందరికీ వర్తిస్తుంది కనుక.. ఇలాంటి కేసులను ముందుకు తీసుకుని రావాల్సి బాధ్యత విపక్షాలపై ఉంది. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందటూ గొంతు చించుకుంటున్న పార్టీలన్నీ..ముందుగా ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న దుర్మార్గాలను చర్చించాలి. వాటిని చర్చించి అందుకు చర్యలు తీసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే అంతా కలసి కేంద్రంపై యుద్ధం చేయడానికి బలం చేకూరుతుంది. ఇకపోతే అదానీ కుంభకోణంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని, దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలని, ప్రతిపక్షాలపై కేంద్ర సంస్థలతో అణిచివేత చర్యలకు స్వస్తి పలకాలని ప్రతిపక్ష ఎంపిలు, పార్టీలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. అయినా కేంద్రం పట్టించుకోవడం లేదు. అలాగే దాడులపై సుప్రీం కోర్టును కూడా విపక్షాలు ఆశ్రయించాయి. అలాగే కేంద్రం కూడా రాహుల్‌పై స్పీడుగా తీసుకున్న చర్యలను సమర్థించుకుంటున్నందున...అన్ని విషయాల్లో ఇలాంటి వేగాన్ని ప్రదర్శించాలి. దేశాన్ని దోచుకున్న లలిత్ మోడీ, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ,విజయ్ మాల్యాల గురించి దర్యాప్తును వేగవంతం చేసి..వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి. వారిని రప్పించే చర్యలను వేగవంతం చేయాలి. దేశంలో భావప్రకటనా స్వేచ్ఛ అంతమైపోయిందని, త్వరలోనే నియంతృత్వ పాలన వస్తుందని విపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ప్రజల గొంతులను అణిచివేసేందుకు ప్రభుత్వం కేసులతో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపి స్తున్నారు. పార్లమెంట్‌లో అదానీ-హిండెన్బర్గ్ వ్యవహారం, రాహుల్ గాంధీకి జైలు శిక్ష తదితర అంశాలపై ప్రతిపక్ష పార్టీ ఎంపిలు మరింత జోరుగా ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే సభలు వాయిదా పడ్డాయి. నిజానికి వీరంతా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న ఆందోళన చెందుతున్న తీరులో అర్థం లేదు. ఎందుకంటే వీరే గతంలో ఇలాంటి భ్రష్టత్వానికి పాల్పడ్డారు. ముఖ్యంగా కాంగ్రెస్ దీనికి ప్రధాన కారణం. కాంగ్రెస్ పాలనలోనే ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టింది. యధారాజా తథా ప్రజా అన్న చందాన ప్రజలు, పాలకులు ఉన్నారు. దేశం ఏమయిపోతే ఏంటన్న ధోరణిలో మన జీవితం సాగిపోతోంది. ప్రతిపక్షాలు తమవరకు రాగానే ఊగిపోతున్నారు. వారి యావ అంతా అధికారం దక్కించుకోవడం లక్ష్యంగా సాగుతోంది. అందుకే అధికారం దక్కించుకున్న పార్టీలు కాంగ్రెస్ లేదా బిజెపి కావచ్చు..అధికార దుర్వి ని యోగానికి పాల్పడుతున్నాయి. ఈ విషయంలో మోడీ రెండాకులు ఎక్కువే చదివారు. అందుకే గతంలో తనకు జరిగిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ..పకడ్బందీగా అమలు చేస్తున్నారు. రాహుల్‌పై వెంటనే చర్యలు తీసుకున్న విధానంలో గతంలో జరిగిన పరాభవాలు దాగివున్నాయి. రాహుల్ గాంధీ అనర్హతపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ ఇది భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజని వ్యాఖ్యానించింది. దీనిపై న్యాయ పరంగా, రాజకీయంగా పోరాటం చేస్తామని స్పష్టం చేసింది. రాహుల్‌గాంధీ నిజం మాట్లాడుతున్నందునే, రాజ్యాంగం కోసం, ప్రజల తరఫున పోరాటం చేస్తున్నందుకే ఆయనను సభనుంచి తొలగిస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీని లోక్‌సభనుంచి బైటికి పంపించి వేస్తే తమ సమస్య పరిష్కారమవుతుందని బిజెపి అనుకొంటోందని, అయితే అది నిజం కాదని, ఎందుకంటే అదానీ వ్యవహారంపై జెపిసి వేయాలన్న డిమాండ్‌ను లేవనేత్తుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి తాము పోరాడు తూనే ఉంటామని, ఒక వేళ జైలుకు వెళ్లాల్సివచ్చినా వెళ్తామని, తమ కార్యకర్తలు పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఖర్గే స్పష్టం చేశారు. నిజానికి పోరాటం అన్నది ప్రజా సమస్యలపై చేయాలి. రాహుల్ పై వేటు వేసినందుకు కాదని గుర్తించాలి. అప్పుడే విపక్ష పార్టీలకు ప్రజలమద్దతు దక్కుతుంది. ఈ విషయం లో తమను ఎవరూ భయపెట్టలేరని, తమ గొంతు నొక్కలేరని ప్రకటించాలి. ఆదానీ కుంభకోణం కావచ్చు.. మరేదైనా కావచ్చు..వాటన్నింటినీ ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలి. బిజెపి అక్రమాలు చేస్తుంటే ఊరూరా ప్రచారం చేయాలి. పార్లమెంటులో దారికి రాకపోతే ప్రజల్లోకి వెళ్లే అవకావం ఉందని గుర్తించాలి. అప్పుడే ప్రతిపక్షాల వాదదను కూడా ప్రజలు అర్థం చేసుకుంటారు.

# కెటిఆర్ రాజీనామా చేయాలి



(మొదటి పేజీ తరువాయి) జడ్జితో విచారణకు అభ్యంతర మేంటని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసులో ఇద్దరే నిందితులన్న కేటీఆర్.. సిట్ 11 మందిని ఎందుకు అరెస్ట్ చేసిందో సమాధానం చెప్పాలన్నారు. పరీక్ష రాసి నష్టపోయిన అభ్యర్థులందరికీ రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. 30 లక్షల నిరుద్యోగుల భవిష్యత్ ను కేసీఆర్ ప్రభుత్వం అందకారం చేసిందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు అండగా బీజేపీ ఉంటుంద న్నారు. వచ్చేది రామరాజ్యమని.. నిరుద్యోగులెవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని తెలిపారు. పేపర్ లీక్ కేసులో ప్రభుత్వ మెడలు వంచేదాకా ఉద్యమిస్తామని చెప్పారు. సిట్ అధికారులను తానే రమ్మన్నాని.. నోటీసులు కూడా తీసుకున్నానని బండి సంజయ్ చెప్పారు. కేసీఆర్ కొడుకు నౌకరీ ఊడగొట్టాలె..మా నౌకరీలు మాకు కావాలె అని బండి సంజయ్ అన్నారు. మహాధర్నాకు పరిమిత సంఖ్యలో నిరుద్యోగులను అనుమతించారు.

### బండి సంజయ్‌కు మారోమారు
# నోటీసులు

(మొదటి పేజీ తరువాయి) మూడు రోజుల క్రితం కూడా సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 24న తమ ఎదుట హాజరై వివరాలు అందించాలని నోటీసుల్లో పేర్కొంది. బండి సంజయ్ తన నివాసంలో లేకపోవడంతో అక్కడే నోటీసులను అధికారులు అతికించారు. గ్రూప్-1లో బీఆర్ఎస్ నేతల పిల్లలు, బంధువులు క్వాలిఫై అయ్యారని రెండ్రోజుల క్రితం బండి సంజయ్ ఆరోపించారు. ఒకే మండలం నుంచి 50 మందికి పైగా క్వాలి÷ అయ్యారని, ఒక చిన్న గ్రామంలో ఆరుగురు క్వాలిఫై అయ్యారని, దీనికి మంత్రి కేటీఆరే బాధ్యుడని బండి సంజయ్ ఆరోపణలు చేశారు. కేసీఆర్ నియమించిన సిట్ విచారణ ఎలా చేయగలదని ఆయన ప్రశ్నించారు. నయీం డైరీ, సినీ తారల డ్రగ్స్ తరహాలోనే పేపర్ లీకేజీ కేసును సిట్‌కు అప్పగించి పక్కదారి పట్టించే కుట్ర జరుగుతోందని బండి సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. సిట్టింగ్ జడ్జి విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాల్సిందేనని, త్వరలో కేటీఆర్ నిర్వాకాన్ని ప్రజల ముందు పెడతామని బండి సంజయ్ తెలిపారు. అయితే అప్పుడు సిట్ విచారణకు హాజరు కాకపోవడంతో మరోసారి బండి సంజయ్‌కు నోటీసులు జారీ చేసింది.

# నేడు లోహా పట్టణంలో బిఆర్ఎస్ సభ

**భారీగా ఏర్పాట్లు చేసిన పార్టీ నేతలు**

**మహారాష్ట్రలో పార్టీ విస్తరణకు సన్నాహాలు**



**ఆదిలాబాద్బాద్,మార్చి25(సమసమాజం):** బిఆర్ఎస్ వివిధ రాష్ట్రాల్లో పాగా వేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పటికీ బీదర్‌లో సభ నిర్వహించిన అనంతరం అక్కడ జోష్ నింపింది. తాజాగా మహారాష్ట్ర నాందేడ్ జిల్లా కంధార్ నియోజకవర్గం లోహ పట్టణంలో ఆదివారం సభకు ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీగా జనాలను తరలించే ఏర్పాట్లు చేశారు. బైల్ బజార్‌లో 15 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణం ముస్తాబయ్యింది. ప్రధాన రహదారులను గులాబీ తోరణాలు, భారీ హోర్డింగులతో ముస్తాబు చేసారు. బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లను ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ మహారాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు మాణిక్‌రావు కదం, కంధార్ మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోంగడె, కన్నాడ్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ జాదవ్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలో కాంగ్రెస్, బీజేపీ, శివసేన కాకుండా మరే పార్టీ కూడా ఈ స్థాయిలో సభను నిర్వహించలేదు. దీంతో సభా ఏర్పాట్లను చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. బీఆర్ఎస్ నేతలు బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూనే మరోవైపు తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో కలియ తిరిగారు. పర్భణి, లాతూర్, నాందేడ్ లోక్‌సభా నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఊరూరా ముమ్మర ప్రచారం చేసారు. ముఖ్యంగా కంధార్, లోహా, కన్నాడ్, డెగులూర్, పూర్ణా, గంగాఖేడ్, ముద్ఖేడ్, పత్రి, పాలా, చందోలి, చౌక్, మన్వర్, అహ్మదాపూర్, ధర్మాబాద్, బిలోలితోపాటు ఇతర నియోజకవర్గాలు, తాలూకాలను చుట్టివస్తూ.. అక్కడివారితో ముచ్చటించి వారిని సభకు ఆహ్వానించారు. తెలంగాణ పథకాలు, అభివృద్ధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. 26న నిర్వహించే సభకు భారీగా తరలిరావాలని కోరారు. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్‌పార్టీ శ్రేణులకు గ్రామగ్రామాన ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. లోహా సభ ఏర్పాట్లు ముగింపు దశకు చేరుకొన్నాయని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కంధార్ లోహా పట్టణవాసులతోపాటు పర్భణి, లాతూర్, నాందేడ్ జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల ప్రజలు తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధితో తమ అభివృద్ధిని పోల్చి చూసుకొంటున్నారని, అనతికాలంలోనే కేసీఆర్ పాలనలో తెలంగాణలో అన్ని రంగాల్లో వచ్చిన మార్పులను చూస్తూ ఆశ్చర్యపడుతున్నారని వివరించారు. తెలంగాణలో అమలవుతున్న పింఛన్లు, రైతు బంధు, రైతు బీమాలాంటి పథకాలు తమకూ కావాలని ఇక్కడి ప్రజలు కోరుకొంటున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్‌కు మరాఠా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజల కోసం జైల్‌కు వెళ్లడానికి సిద్ధమే

(మొదటి పేజీ తరువాయి) అవకాశం లేకుండా ఎందుకు చేస్తున్నావు? భారత ప్రజల ప్రజాస్వామిక గొంతు వినిపించేందుకు, కాపాడేందుకు నేనిక్కడ ఉన్నాను. నేను దేనికీ భయపడనని రాహుల్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు ఇదివరకటిలా మీడియా సంస్థల నుంచి లభించిన మద్ధతు ఇప్పుడు లేదు. ఇది ఓబీసీల వ్యవహారం కాదు. ఇది మోదీ-అదానీల సంబంధానికి సంబంధించిన వ్యవహారం. దాన్నుంచి దృష్టి మళ్లించడం కోసం విదేశాల్లో నా వ్యాఖ్యల గురించి మాట్లాడతారని, అనర్హత అంశాన్ని తీసుకొస్తారని మండిపడ్డారు. ఇప్పుడు ఓబీసీ అంటున్నారు. నేను నిజం మాట్లాడతాను. మాట్లాడుతూనే ఉంటాను. నాపై అనర్హత వేటు వేసినా, జైల్లో పెట్టినా నాకు పెద్ద తేడా ఏమీ లేదని రాహుల్ స్పష్టం చేశారు.. అనర్హతలు లాంటివి నన్ను ఏమి చేయలేవు. ఇలాంటి వాటిని నేను పట్టించుకోను. నా పోరాటాన్ని యధావిధిగా కొనసాగిస్తాను. మోదీని ప్రశ్నిస్తూనే ఉంటాను. ఇది ఓబీసీ వ్యవహారం కాదు... మోదీ, ఆదానీ మధ్య ఉన్న బంధం పై ప్రశ్నిస్తున్నాను. రూ. 20 వేల కోట్లు ఎక్కడివి, ఎక్కడి నుంచి ఆదానీ షెల్ కంపెనీల్లోకి వచ్చాయో చెప్పాలి. ఈ దేశం నాకు ప్రేమ, ఆప్యాయత సహా అన్ని ఇచ్చిందని రాహుల్ చెప్పారు. అదానీ షెల్ కంపెనీల్లో రూ. 20 వేల కోట్లు పెట్టుబడులు ఎవరు పెట్టారని కాంగ్రెస్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ ప్రశ్నించారు. అదానీ షెల్ కంపెనీల్లో ఎవరుపెట్టుబడులు పెట్టారో ప్రధాని మోడీ చెప్పాలని డిమాండ్ చేశారు. చైనీయులు అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారని ఆరోపించారు. మోడీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచే అదానీతో సంబంధాలున్నాయని వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించి అదానీకి ఎయిర్ పోర్టుల నిర్మాణ బాధ్యతలను కట్టబెట్టారని ఆరోపించారు. లండన్ తన ప్రసంగంపై కేంద్ర మంత్రులు అబద్దాలు ప్రచారం చేశారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ లోనూ అబద్దాలు మాట్లాడారని చెప్పారు. మంత్రుల ఆరోపణలపై సమాధానం చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్ ను కోరితే..స్పీకర్ నవ్వి మాట్లాడే అవకాశం రాదని తనతో చెప్పినట్లు వెల్లడించారు. అదానీ వ్యవహారంలో పార్లమెంట్ కు సాక్ష్యాలు సమర్పించానన్నారు. లోక్‌సభలో కావాలనే తన ప్రసంగాన్ని తొలగించారని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడులు జరుగుతున్నా యని రాహుల్ గాంధీ మండిపడ్డారు. తనపై వేటే అందుకు నిదర్శనమని చెప్పారు. తాను దేనికి భయపడనని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రశ్నించడం మాత్రం మానేది లేదని స్పష్టం చేశారు. జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమనేనన్నారు. ప్రధాని మోడీ దృష్టిలో దేశమంటే అదానీ..అదానీ అంటే దేశం అని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశం తనకు ప్రేమ, గౌరవం ఇచ్చిందని అన్నారు. తనకు అండగా నిలిచిన విపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. మోడీకి భయం పట్టుకుందని..ఆయనే విపక్షాలకు ఆయుధం ఇచ్చారని చెప్పారు.

## రాహుల్‌పై అనర్హత వేటు దారుణం

(మొదటి పేజీ తరువాయి) యాత్రలో కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారని చెప్పారు. ఈ యాత్రలో రాహుల్ గాంధీ 3500 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని వెంకట్ రెడ్డి తెలిపారు. పాదయాత్రలో రాహుల్ గాంధీ ఎక్కడ రాజకీయాల గురించి మాట్లాడలేదని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఉత్తరాదిలో ఉన్న మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద కూడా టీ షర్టు వేసుకుని పాదయాత్ర చేశారన్నారు. ఎన్నికల సమయంలో రాహుల్ ఒక మాట అంటే దాని మీద కోర్టు తీర్పు ఇచ్చిందని. నెలరోజుల సమయం ఇచ్చి.. వెంటనే స్పీకర్ అనర్హత వేటు వేయటం సరికాదన్నారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడం కోసం మోడీ ఈ చర్య తీసుకున్నారని విమర్శించారు వెంకట్ రెడ్డి. గతంలో తనను కూడా డిస్క్వాలి÷ చేశారని గుర్తు చేశారు. గాంధీ కుటుంబానికి పదవుల లెక్క కాదని.. ప్రధానమంత్రి అవకాశం వచ్చినా సోనియా గాంధీ ఒక ఆర్థిక వేత్తను ప్రధానిగా చేశారన్నారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా పేదలు అన్నం తింటున్నారంటే సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ లాంటి నాయకులు చలవే అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొనియాడారు.

## వ్యాపారవేత్తలను ఆకర్శించడంలో విఫలం: కెటిఆర్



**హైదరాబాద్,మార్చి25(సమసమాజం):** పార్లమెంటరీ ప్యానెల్ నివేదికపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. వ్యాపారవేత్తలను ఆకర్షించడంలో దేశం విఫలమైందన్న ప్యానెల్ పేర్కొంది. చైనా నుంచి బయటకు వచ్చే వ్యాపారులను ఆకర్షించలేదని నివేదికలో పేర్కొనడం జరిగింది. బీజేపీకి ఆర్థికం కంటే రాజకీయమే ప్రాధాన్యమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాజకీయానికి ప్రాధాన్యమిస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. టెలిప్రాంప్టర్ చూసి ప్రసంగించడం సులువే. పటిష్ట ప్రయత్నాలు లేకపోతే ఫలితాలు రావడం కష్టం అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఇందిర అడుగుజాడల్లో రాహుల్ గాంధీ



**ఇందిర అడుగజాడల్లో రాహుల్**

**జైలుకు వెళ్లడం ద్వారా సానుభూతికి యత్నం**

**రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ ఎంపిల రాజీనామా యోచన?**


**రాజకీయ ప్రత్యామ్నాయాలపై చర్చిస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు**



**న్యూఢిల్లీ, మార్చి 25 (సమసమాజం):** ఇందిర అడుగజాడల్లో రాహుల్ రాజకీయ సోపానం నిర్మించుకోవాలని చూస్తున్నారు. జైలుకు వెళ్లడం ద్వారా సానుభూతికి యత్నం చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. అలాగే రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ ఎంపిల రాజీనామా యోచనలో కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఏది చేస్తే లాభమో అన్న తీరులో రాజకీయ ప్రత్యామ్నాయాలపై కాంగ్రెస్ అగ్రనేతలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇందిరాగాంధీ ఆదర్శంగా రాహుల్ గాంధీ అడుగులు వేస్తున్నారు. 1977 లో అనర్హత వేటు పడినప్పుడు కొద్ది రోజులపాటు ఇందిరమ్మ జైల్లో ఉన్నారు. దీంతో ఆమెకు ప్రజల్లో భారీగా ఇమేజ్ పెరిగింది. ఇదే తరహాలో ఇప్పుడు తన రాజకీయ జీవితాన్ని మలచుకోవాలని యోచిస్తున్నారు. అలాగే వయనాడ్‌కు ఉప ఎన్నిక వస్తే తన స్థానంలో ప్రియాంకను పార్లమెంట్‌కు పంపించే విషయాన్ని కూడా రాహుల్ చర్చిస్తున్నాట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీకి మద్దతుగా మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకు కాంగ్రెస్ ఎంపీలు సిద్ధపడుతున్నట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ సైతం జైలుకు వెళ్లేందుకే సిద్ధపడుతున్నట్టు సమాచారం. ఎంపీలు మూకమ్మడిగా రాజీనామా చేసే అంశాన్ని కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలిస్తోంది. ఎందుకంటే లోక్‌సభలో ఎలాగూ చర్చలకు అవకశాం లేదు. మాట్లాడేందుకు అవకాశం రావడం లేదు. దీనిని సాకుగా చేసుకుని ప్రజాక్షేత్రంలో మరింత బలపడాలని కాంగ్రెస్ యోచిస్తోంది. త్వరలో సూరత్ లేదా ఢిల్లీలో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ అధిష్టానం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మరోవైపు రాహుల్‌పై అనర్హత వేటు ప్రతిపక్షాల ఐక్యతకు మార్గం ఏర్పడింది. మహారాష్ట్రలో శరద్ పవార్, ఉద్ధవ్‌ఠాక్రే, ఢిల్లీలో కేజీవ్రాల్, తమిళనాడులో స్టాలిన్, బెంగాల్‌లో మమత నుంచి తెలంగాణలో కేసీఆర్ వరకూ విపక్షనేతలు స్పందించిన తీరు ఇందుకు ఉదాహరణగా చూడాలి. రాహుల్‌పై వేటుతో రాబోయే రోజుల్లో రాజకీయ పర్యవసానాలు తీవ్రంగా ఉండనున్నాయని విశ్లేషించాయి. ప్రతిపక్ష నేతల స్వరాన్ని తొక్కిపట్టేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని శరద్ పవార్ ఆరోపిస్తే.. ఇంకే మాత్రం ఆలస్యం చేయకుండా ప్రతిపక్షాలు ఏకం కావాలని ఆర్జేడీ నేత తేజస్వియాదవ్, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, ఆప్‌నేత కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. వారంతా స్పందించిన తీరు చూస్తే.. దేశంలో త్వరలో ప్రతిపక్షాల నేతృత్వంలో బలమైన ఫ్రంట్ ఏర్పాటుకు అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. జనతాపార్టీ తరహాలో ఉమ్మడిగా ఫ్రంట్ లేదా కూటమితో ముందుకు సాగాలని చూస్తున్నాయి. కాంగ్రెస్ కూడా ఇప్పుడు తన నాయకత్వం గురించి ఆలోచించే పరిస్థితిలో లేదని, అన్ని పార్టీలతో కలిసి పోరాడేందుకే సమాయత్తమవుతోంది. జైలుకు వెళ్లడం ద్వారా రాహుల్ పట్ల దేశంలో మరింత ఆదరణ పెరగగలదని కూడా భావిస్తున్నారు. అయితే అన్నవిషయాలను, అనేక మార్గాలను కాంగ్రెస్‌తో పాటు ఇతర నేతలు కూడా చర్చిస్తున్నారు. ఎలా వెళితే మోఢీని ఢీకొనగలమో అన్న ఆలోచనలో విపక్ష పార్టీలు మేధోమధనం చేస్తున్నాయి.


# ఎల్‌బీ నగర్ చౌరస్తాకు శ్రీకాంతాచారి పేరు

(మొదటి పేజీ తరువాయి)ఈ నెలఖారు వరకు పట్టాలు అందించి, ఆ బాధ నుంచి విముక్తి చేస్తాం. మిగిలిన కాలనీల వారికి కూడా న్యాయం చేస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సిసోడియా మధ్యంతర బెయిల్ పిటిషన్


### ఎప్రిల్ 5కు వాయిదా వేసిన రౌస్ అవెన్యూ కోర్టు



**న్యూఢిల్లీ, మార్చి 25 (సమసమాజం):** ఢిల్లీ మాజీ డిప్యుటీ సీఎం మనీశ్ సిసోడియా మధ్యంతర బెయిటల్ పిటిషన్‌ను కోర్టు ఏప్రిల్ 5కు వాయిదా వేసింది. సిసిఓడియా మద్యం కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. ఈ క్రమంలో మనీశ్ సిసోడియా బెయిల్ కోరుతూ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పిటిషన్ పై విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది. ఏప్రిల్ 5కు వాయిదా చేసినట్లు శనివారం కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో అధికారుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోంది. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈడీ అధికారులు రోజూ గంటల పాటు మనీశ్ సిసోడియాను విచారిస్తున్నారు. అటు కోర్టు కూడా ఆయన కస్టడీ గడువును పెంచుతూ పోతోంది. కీలక వివరాలు సిసోడియా చెప్పడం లేదని, విచారణకు సహకరించడం లేదని ఈడీ అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే సిసోడియా మాత్రం తాను అన్ని ప్రశ్నలకూ సమాధానం చెబుతున్నట్టు వివరిస్తున్నారు. రౌజ్ అవెన్యూ కోర్టులో బెయిల్ పిటిషన్ కూడా వేశారు. దీనిపై విచారణ జరగలేదు. కస్టడీని పొడిగిస్తోందే తప్ప ఏ నిర్ణయమూ తీసుకోవడం లేదు కోర్టు. స్పెషల్ జడ్జ్ నాగ్‌పాల్ శనివారం జరగాల్సిన ఈ విచారణను వాయిదా వేశారు. దీనిపై ఈడీ వివరణ ఇచ్చిన తరవాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మీనా రెండో పెళ్లి గురించి అబద్ధాల వార్తలు

### పదేపదే ఖండించినా తప్పని వేధింపులు
### మరోమారు తీవ్రంగా ఖండించిన నటి మినా



**చెన్నై, మార్చి 25 (సమసమాజం):** గతేడాది భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న నటి మీనా రెండో పెళ్లి వార్తలపై మరోసారి తీవ్ర దుమారం రేగింది. ఆమె త్వరలో ఓ యంగ్ తమిళ హీరోను పెళ్లి చేసుకోనుందని, వారిద్దరి నిశ్చితార్థానికి ముహూర్తం కూడా జరిగిందని జోరుగా ప్రచారం సాగుతోంది. రెండో పెళ్లి వార్తలపై ఇంతకుముందే స్పష్టత ఇచ్చిన మీనా.. తాజాగా వస్తోన్న వార్తలను తీవ్రంగా ఖండించారు. ఆ వార్తల్లో ఎలాంటి ప్రచారం లేదని కుండబద్దలు కొట్టినట్టు స్పష్టం చేశారు. ఒకప్పుడు టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న నటి మీనా గతేడాది జూన్ 28న భర్త విద్యాసాగర్ ను కోల్పోయారు. ఆ బాధ నుంచి తేరుకునే ప్రయత్నంలో భాగంగానే పలు చిత్రాల్లో నటిస్తూ కాలం గడుపుతున్నారు. కుటుంబసభ్యులు రెండో వివాహం చేసుకోవాలని సూచించినా.. వాళ్ల ప్రతిపాదనను పక్కన పెడుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే అప్పట్లో మీనా రెండో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆ వార్తలపై స్పందించిన ఆమె.. తాను రెండో పెళ్లి చేసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఇప్పుడు మరోసారి మీనా మరో పెళ్లిపై అదే తరహా ప్రచారం జరుగుతోంది. కారణం ఓ తమిళ యూట్యూబ్ వీడియో. ఆమె త్వరలో ఓ తమిళ హీరోను పెళ్లి చేసుకోబోతున్నారని, అతను గతేడాది భార్యకు విడాకులు ఇచ్చి విడిపోయారంటూ ప్రసారం అయింది. అంతే కాదు ఆ హీరోకు 39ఏళ్లు అని, అతను మీనా కంటే చిన్నవాడని, వారిద్దరి నిశ్చితార్థం కూడా జరిగినట్టు ఆ కథనం సారాంశం. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. కోలీవుడ్ తో పాటు టాలీవుడ్ లోనూ మీనా రెండో పెళ్లి వార్త హాట్ టాపిక్ గా మారింది. మరికొందరేమో ఈ కామెంట్స్ చేసిన వ్యక్తిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కామెంట్లపై తాజాగా నటి మీనా స్పందించారు. అతను చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. డబ్బు, పేరు కోసం ఏమైనా రాస్తారా.. సోషల్ మీడియా రోజు రోజుకూ దిగజారిపోతోందంటూ మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకొని రాయండంటూ మీనా హెచ్చరించారు. తన భర్త చనిపోయినపుడు కూడా రకరకాల తప్పుడు వార్తలు ప్రచారం చేశారని, ఇంకోసారి తనపై రాంగ్ రూమర్స్ క్రియేట్ చేస్తే చర్యలు తీసుకుంటానంటూ మీనా గట్టిగానే వార్నింగ్ ఇచ్చినట్టు ఆమె సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## 9కొత్త మెడికల్ కాలేజీల్లో వేగంగా పనులు


- వైద్య విద్యార్థులకు హాస్టల్ వసతి పూర్తి కావాలి
- ఉమ్మడి ఎపిలో 5 కాలేజీలు ఉంటే ఇప్పుడు 26కు చేరిక
- కొత్త కాలేజీలకు అనుగుణంగా స్టాఫ్ నియామకానికి ఆదేశాలు
- అధికారులతో సమీక్షించిన మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, మార్చి 25 (సమసమాజం):** రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయబోతున్న తొమ్మిది మెడికల్ కాలేజీలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. తొమ్మిది కాలేజీల్లో వైద్య విద్యార్థులకు అవరమయ్యే హాస్టల్ వసతి సహా అన్ని కల్పించాలని అధికారులకు సూచించారు. తరగతులు ప్రారంభమయ్యే నాటికి అవసరమైన ఫర్నీచర్, ఎక్విప్మెంట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మెడికల్ కాలేజీల నిర్మాణ పనులపై శనివారం ఎంసీహెచ్‌ఆర్‌డీ లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చే జూలై ఆగస్టు నాటికి అకడమిక్ ఇయర్ ప్రారంభం అయితే కొత్తగా 9జిల్లాల్లో విద్య, వైద్యం ప్రజలకు మరింత చేరువవుతుందన్నారు. ఈ ఏడాది 9 మెడికల్ కాలేజీలు సాధిస్తే, రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 26 కు చేరుతుందని, ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 3690కి పెరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 5 మెడికల్ కాలేజీలు ఉంటే, ఇప్పుడు 26కు చేరుతుండడం వైద్యం, విద్యను బలోపేతం చేయాలన్న సీఎం కేసీఆర్ పట్టుదలకు నిదర్శనం అన్నారు. 60 ఏళ్లలో 5 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, గడిచిన 8, 9 ఏళ్లలో 21 మెడికల్ కాలేజీలు రావడం గొప్ప విషయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేస్తే తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదనీ, అయినప్పటికీ వెనుకాడకుండా సీఎం కేసీఆర్ ప్రజలకు వైద్యం, వైద్య విద్యను చేరువ చేసేందుకు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారని వివరించారు.తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభించే లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 67 మందికి ప్రమోషన్లు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. 210 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు వారం రోజుల్లో కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 1,442 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చివరి దశకు చేరిందని, రెండు మూడు రోజుల్లో ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసి, పది రోజుల్లో తుది నియామక పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సెలింగ్ నిర్వహించి తొమ్మిది మెడికల్ కాలేజీల్లో వీరిని నియమించాలన్నారు. కాలేజీల విషయంలో సమన్వయం కోసం మంత్రులు ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, అజయ్ కుమార్, పలు జిల్లా కలెక్టర్లతో మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనరలో గతేడాది 8 మెడికల్ కాలేజీలు ఒకేసారి ప్రారంభించి రికార్డు సృష్టించామని, ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, వికారాబాద్, జనగాం, నిర్మల్, భూపాలపల్లి, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎంబీబీఎస్ అకడమిక్ ఇయర్ ప్రారంభమ య్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లోపాలు లేకుండా చూడాలన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ బృందం పరిశీలనకు వస్తున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలన్నారు. మెడికల్ కాలేజీల పనులు వేగవంతం చేసేందుకు ఈ నెల 28 న ఆయా తొమ్మిది జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, కాలేజీల ప్రిన్సిపాల్స్, ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబోతున్నట్లు తెలిపారు. వచ్చే వారం రోజుల్లో కొత్త మెడికల్ కాలేజీలు సందర్శించి, పనులు వేగిరం చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంఈ రమేశ్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు. సమీక్ష సమావేశంలో హెల్త్ సెక్రెటరీ రిజ్వి, డీఎంఈ రమేశ్ రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, టీఎస్ఎంఎస్ ఐడీసీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్, ఇతర ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

# జేబీ వెంచర్‌లో మైనింగ్ బంద్

- సమసమాజం వార్తకు స్పందించి జేబీ వెంచర్లను సందర్శించిన అధికారులు
- అనుమతులు లేకుండా గ్రానైట్ తరలిస్తే కఠిన చర్యలు
- మైనింగ్ ఆర్.ఐ సత్యనారాయణ






**ఇబ్రహింపట్నం, మార్చి 25 (సమసమాజం):** జేబీ వెంచర్‌లో మాయమవుతున్న గుట్టలు అనే శీర్షిక సమసమాజం పత్రికలో శనివారం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించి మైనింగ్ ఏడి ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఆర్‌ఐ సత్యనారాయణను సంఘటన స్థలానికి పంపించారు. మైనింగ్ ఆర్ ఐ సత్యనారాయణ జేబీ వెంచర్ లోని అన్ని ప్రదేశాలు తిరిగారు. అనుమతులు లేకుండా గ్రానైట్లను తరలిస్తే చర్యలు తీసుకుంటామని జేబీ వెంచర్ లోని సూపర్వైజర్లకు చెప్పారు. మైనింగ్ ఆర్ ఐ సత్యనారాయణ వెళ్ళే సమయంలో గ్రానైట్ మైనింగ్ చేసి వాళ్ళు కనిపించకపోవడం గమనార్హం. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జేపీ వెంచర్ లో మాయం అవుతున్న గుట్టలు అనే శీర్షికతో పోలీసులు ఎస్వోటీ, రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టి ఈ వెంచర్ పై మళ్ళింది. ఇప్పటి నుంచి ఎలాంటి గ్రానైట్లను తరలించిన సంబంధిత సంస్థ లేదా వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఆయా శాఖల అధి కారులు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తుంది. జేబీ వెంచర్ లో ఇద్దరు వ్యక్తులు ప్రధానంగా గ్రానైట్ మాఫియాను నడిపిస్తున్నట్టు అనుమా నాలు వచ్చినట్లుగా అందుకు తగ్గట్టుగా అధికారులు పూర్తి సర్వే చేసినట్లు తెలిసింది. వారిపై ప్రత్యేక దృష్టి సాధించినట్లు తెలిసింది.

# తమది మహిళా పక్షపాతి ప్రభుత్వం

- దేశంలోనే రోల్‌మోడల్‌గా పొదుపు సంఘాలు
- మూడో విడతలో భాగంగా రూ.6,419.89 కోట్లు విడుదల
- దెందులూరు సభలో బటన్ నొక్కి విడుదల చేసిన సిఎం జగన్

**ఏలూరు,మార్చి 25 (సమసమాజం):** తమది మహిళా పక్షపాతి ప్రభుత్వమని సీఎం జగన్ అన్నారు. అలాగే రాష్ట్రంలోని పొదుపు సంఘాలు దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలిచాయని ప్రశంసలు కురిపించారు. 'వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా రూ.6,419.89 కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ అవుతాయి. ఈ పథకంలో ఎక్కడా లంచాలు ఉండవు, వివక్ష ఉండదు. ఈ మొత్తాన్ని ఎలా ఖర్చుచేసుకోవాలన్నదీ మీ అభిమతానికే విడిచి పెట్టాను. స్వయం ఉపాధి పొందాలనుకుంటే.. ప్రభుత్వం పరంగా అండదండలు ఉంటాయి. అక్షరాల రూ.19,178 కోట్లు ఒక్క ఆసరా కార్యక్రమం కింద ఇచ్చాం. మహిళలకు తోడ్పాటు ఇస్తూ, సలహాలు ఇస్తూ.. అన్నగా ప్రభుత్వం నిలబడుతుంది. అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక స్వాతంత్య్రం కల్పించేందుకు సీఎం జగన్ రాష్ట్ర ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పథకం 'వైఎస్సార్ ఆసరా'. ఈ పథకంలో భాగంగా ఇప్పటికే వేల కోట్ల రూపాలయను మహిళల ఖాతాల్లోకి జమ చేసిన జగన్ సర్కార్ మూడో విడత నిధులు విడుదల చేసింది. ఏలూరు జిల్లా దెందులూరులో జరిగిన బహిరంగ కార్యక్రమంలో బటన్ నొక్కి రూ.6,419.89 కోట్లను నేరుగా మహిళల ఖాతాల్లోకి జమ చేశారు. అనంతరం మాట్లాడిన జగన్ ..ఆసరా, చేయూత, సున్నా వడ్డీ ద్వారా అనేక కార్యక్రమాలను క్రోడీకరించామన్నారు. ఈ నిధులతో 9 లక్షల మందికిపైగా నా అక్క చెల్లెమ్మలు రకరకాల వ్యాపారాలు చేసుకుంటున్నారు. రూ.4355 కోట్లను బ్యాంకుల ద్వారా వారికి అనుసంధానం చేశాం. తద్వారా వారి కుటుంబాలకు వారు అండగా నిలబడుతున్నారని అన్నారు. గతంలో పొదుపు సంఘాలకు సంబంధించిన సగటున వారికి వచ్చే బ్యాంకుల రుణాలు రూ.14వేల కోట్లు కాగా, ఇవాళ బ్యాంకుల ద్వారా ఏటా రూ.30 వేల కోట్లు సగటున




అందుతున్నాయి. 99.55 శాతం రుణాలను పొదుపు సంఘాలు చెల్లిస్తున్నాయి. తద్వారా దేశానికి రోల్‌మోడల్‌గా ఏపీ పొందుపు సంఘాలు నిలుస్తున్నాయి. బ్యాంకులతో మాట్లాడి వడ్డీ శాతాలను తగ్గించాం. ఇంకా తగ్గించేలా బ్యాంకర్లమీద ఒత్తిడి తీసుకువస్తున్నాం. చంద్రబాబు వల్ల దెబ్బతిన్న పొదుపు సంఘాల ఉద్యమం.. మళ్లీ ఊపిరి పోసుకుంది. ఎన్‌పీఏలు, ఓవర్ డ్యూలు కేవలం 0.45శాతం మాత్రమే. ఇది గత ప్రభుత్వం హయాంలో 18.36శాతం. రుణాలు మాఫీచేస్తానని చంద్రబాబు గత ఎన్నికల్లో చెప్పారు. వారిని నిలువునా ముంచేశారు. 2016 అక్టోబరు నుంచి కూడా సున్నా వడ్డీరుణాల పథకాన్ని చంద్రబాబు నిలిపేశారు. రూ.3వేల కోట్ల వడ్డీలు, చక్రవడ్డీలు కట్టాల్సిన పరిస్థితి దాపరించింది. మేం అధికారంలోకి వచ్చాక తిరిగి సున్నావడ్డీ కిందరుణాలు వచ్చే పరిస్థితిని తీసుకు వచ్చాం. 2016 అక్టోబరులో నిలిచిపోయిన ఈ పథకాన్ని తీసుకొచ్చి రూ.3600 కోట్లు చెల్లించాం. చిక్కటి చిరునవ్వుతోనే ఇదంతా చేశాం. మహిళా పక్షపాత ప్రభుత్వం మనది అని అన్నారు. ఈ 45 నెలల కాలంలో మీ జగనన్న ప్రభుత్వం, మీ తమ్ముడి ప్రభుత్వం? మహిళా పక్షపాత ప్రభుత్వంగా అడుగులు ముందుకేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకూ రూ.2,25,330.76 కోట్లు అక్క చె÷-లలెమ్మలకు ఇచ్చాం. మహిళ వివక్షమీద పోరాటం చేస్తోంది ఈప్రభుత్వం. కోట్లమంది అక్కచె÷-లలెమ్మలు తమ అన్నకు రక్షా బంధనం కట్టిన ప్రభుత్వం మనది. ప్రతి రూపాయి అక్క చె÷-లలెమ్మలకు ఇవ్వాలి, కుటుంబాలు బాగుపడతాయని నమ్మిన ప్రభుత్వం ఇది. దేవాలయాల ఛైర్మన్, ఏంఎసీ.. ఇలా నామినేటెడ్ పదవుల్లో 50శాతం అక్కచె÷-లలెమ్మలకు ఇచ్చాం. అక్క చె÷-లలెమ్మలకు ఎలాంటి హానీ కలగకూడదనే ఉద్దేశంతో దిశ యాప్‌ను తీసుకు వచ్చాం. ఇందులో 1.17 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారు. 21 శతాబ్దపు ఆధునిక మహిళ మన రాష్ట్రంలో ప్రతి గ్రామం నుంచి రావాలని తపనపడుతున్నానని సీఎం జగన్ పేర్కొన్నారు . కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# రాహుల్‌పై అనర్హత వేటు వ్యవహారం

- వేగంగా పావులు కదిపిన బిజెపి
- రాజకీయ నేతలు ఇక నోరు అదుపులో పెట్టుకోవాల్సిందే

**న్యూఢిల్లీ,మార్చి 25 (సమసమాజం):** రాజకీయాల్లో వ్యక్తిగత విమర్శలకు తావుండరాదు. సిద్ధాంతపరమైన విమర్శలే ఉండాలి. ప్రజాస్వామ్యంగా ఉండాలి. అవతలి వారిని తూలనాడాలన్న భావన ఎవరికీ మంచిది కాదు. రాహుల్ అనుభవంతో అన్ని రాజకీయ పార్టీల నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. నోరుంది కదాని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం, భాషను అదుపులో పెట్టుకోక పోవడం అన్నది సరికాదని గుర్తించాలి. రాహుల్ గాంధీ పరువునష్టం కేసు అనేక మలుపులు తిరిగింది. 2019నాటి కర్ణాటక ఎన్నికల సందర్భంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ పరువునష్టం దావా వేశారు. అయితే హైకోర్టులో ఆ కేసు విచారణ చాలారోజులుగా పెండింగ్‌లో ఉన్నది. ఈ క్రమంలో లోక్‌సభలో అదానీ అంశంపై విపక్ష నేత రాహుల్‌గాంధీ ఫిబ్రవరి 7న మోదీ ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో విమర్శించారు. మోదీ-అదానీ బంధాన్ని ప్రశ్నించారు. ఆ తర్వాతే బీజేపీ తన వ్యూహాలకు పదును పెట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. హైకోర్టులో కేసును ఉపసంహరించుకున్న పిటిషన్‌దారు సూరత్‌కోర్టును తిరిగి ఆశ్రయించడంతో.. ఫిబ్రవరి 27న ఈ కేసులో విచారణ ప్రారంభమైంది. మార్చి 17న విచారణ ముగించి, తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం.. 23న రాహుల్‌కు శిక్షను ఖరారు చేసింది. కేవలం 24 రోజుల్లో విచారణ పూర్తిచేసి శిక్ష ఖరారు చేయడం గమనార్హం. ఇదంతా బిజెపి వ్యూహాత్మకంగా చేసిందనేది బహిరంగంగా కనిపిస్తున్న చర్యగా చూడాలి. ఏప్రిల్ 13, 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో కర్నాటకలోని కోలార్‌లో ర్యాలీలో పాల్గొన్న రాహుల్.. మోదీ ఇంటిపేరును ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. మోడీ ఇంటిపేరున్న వారంతా దొంగలే అన్న అర్థంలో విమర్శలు చేశారు. నిజానికి ఇది తీవ్ర ఆరోపణగానే గుర్తించాలి. రాహుల్ ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యంగా ఉంటూ వచ్చారు. అనేక సందర్భాల్లో ఇలాంటి అనేక విమర్శలు చేస్తూనే ఉన్నారు. తనకు ఎదురు లేదన్న భావనలో ఉన్నారు. ఇక అవకాశం కోసం చూస్తున్న బిజెపి..రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ కోర్టులో పరువునష్టం దావా వేశారు. ఈ మేరకు రాహుల్‌పై ఐపీసీ సెక్షన్ 499, 500, 504 కింద అభియోగాలు నమోదయ్యాయి. దీంతో రాహుల్ గాంధీపై కేసు రిజిష్టర్ చేస్తూ న్యాయమూర్తి సమన్లు పంపారు. అక్టోబర్ 10, 2019న కోర్టు విచారణకు రాహుల్ హాజరయ్యారు. తనపై ఆరోపణల్ని కొట్టేయాలని న్యాయమూర్తిని కోరారు. జూన్, 2020 తానెప్పుడూ అలాంటి ఆరోపణలు చేయలేదని రాహుల్ కోర్టుకు తెలిపారు. అక్టోబర్ 29, 2021: వాంగ్మూలం రికార్డు చేయటం కోసం తమ ముందుకు రావాలని కోర్టు ఆదేశించింది. మార్చి 17, 2023న సూరత్ కోర్టులో ముగిసిన వాదోపవాదాలు. తీర్పు రిజర్వ్ చేసింది. మార్చి 23, 2023: పరువునష్టం కేసులో రాహుల్‌ను దోషిగా తేల్చిన సూరత్ కోర్టు. రెండేండ్లు జైలుశిక్ష ఖరారు చేసింది.. ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించే వెసులుబాటు ఇస్తూ తీర్పు ఇచ్చింది. ఇదంతా చకచకా జరగడం వెనక బిజెపి పావులు కదిపిందన్నది చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో జరిగిన కేసులను ఓసారి పరిశీలిస్తే.. లక్షద్వీప్ ఎంపీ మొహమ్మద్ ÷జైల్‌ను అక్కడి సెషన్స్ కోర్టు దోషిగా తేల్చింది. ఓ హత్యాయత్నం కేసులో ఈ తీర్పు వెలువరించింది. దీంతో గత జనవరిలో ఎంపీగా ఆయన అనర్హత వేటుకు గురయ్యారు. అయితే, కేరళ హైకోర్టు స్టే విధించడంతో మళ్లీ ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని న్యాయశాఖ సిఫారసు చేసింది. లాలూ ప్రసాద్ యాదవ్: దాణా కుంభకోణం కేసులో దోషిగా తేలిన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కూడా 2013లో లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. జైలుశిక్షా కాలంతో పాటుగా మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా అనర్హులవుతారు. ప్రజాప్రతినిధులు దోషులుగా తేలిన వెంటనే అనర్హులుగా పరిగణించాలని 2013లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడు ఇవన్నీ బిజెపి బాగా ఉపయోగించుకుంది.

# ల్యాండ్ ఫర్ జాబ్ కేసు

- సిబిఐ ముందు హాజరైన తేజస్వీ, మిసాభారతి
- విచారణకు సహకరిస్తామన్న తేజస్వీ యాదవ్

**న్యూఢిల్లీ,మార్చి 25 (సమసమాజం):** ఉద్యోగాల కోసం భూ కుంభకోణం కేసులో బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ ను సీబీఐ, ఆయన సోదరి మీసా భారతిని ఈడీ శనివారం ప్రశ్నించింది. విచారణ కోసం న్యూఢిల్లీలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ప్రధాన కార్యాలయానికి వచ్చినప్పుడు, తాను, తన కుటుంబం ఈ కేసులో పోరాడాలని నిర్ణయించుకున్నట్లు బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ చెప్పారు.మరోవైపు ఇదే కేసుకు సంబంధించి తేజస్వి సోదరి మీసా భారతిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం ఢిల్లీ కార్యాలయంలో ప్రశ్నించింది. ఉద్యోగాల కోసం భూ కుంభకోణంలో తేజస్వీ సోదరి మిసా భారతిని ప్రశ్నించే ముందు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ మీసాభారతి ఇంటికి వెళ్లారు. ప్రాంతీయ పార్టీల పరువు తీసేందుకు ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను బీజేపీ దుర్వినియోగం చేసిందని అఖిలేష్ అన్నారు. భూమి-ఉద్యోగాల కుంభకోణం కేసులో తేజస్వి యాదవ్‌ను ఈ నెలలో అరెస్టు చేసే ఆలోచన లేదని సీబీఐ న్యాయవాది జస్టిస్ దినేష్ కుమార్ శర్మ ముందు చెప్పారు. సీబీఐ తనకు జారీ చేసిన సమన్లను రద్దు చేయాలంటూ తేజస్వీ యాదవ్‌పై వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.దీంతో తేజస్వీ విచారణకు హాజరు అయ్యారు. ల్యాండ్ ఫర్ స్కామ్ కేసుకు సంబంధం ఉన్నట్టుగా భావిస్తున్న బిహార్ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సీబీఐ విచారణకు హాజరయ్యారు. అంతకుముందు మార్చి 16న తేజస్వీ యాదవ్ ను అరెస్టు చేయబోమని దర్యాప్తు సంస్థ ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. ఆ తర్వాత ఆయన సీబీఐ ముందుకు హాజరయ్యేందుకు అంగీకరించారు. తాము ఏజెన్సీలకు ఎల్లప్పుడూ సహకరిస్తామని తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో పరిస్థితులు చాలా కష్టంగా మారాయని, అయినా తాము పోరాడి, గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కేసులో ఫిబ్రవరి 28, మార్చి 4, 11న తేజస్వీ యాదవ్ కు సమన్లు జారీ చేసినప్పటికీ.. ఆయన సీబీఐ ఎదుట హాజరుకాలేదు. ఈ నేపథ్యం లోనే ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఇతర అధికారులపై ఆరోపణలు ఉన్న లాండ్ ఫర్ జాబ్ కేసులో తనకు సమన్లు ఇవ్వడంపై కోర్టులో సవాల్ చేశారు. తండ్రి లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు తాను మైనర్ అని, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అలాగే విచారణ కోసం ఢిల్లీకి పిలువడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసుకు సంబంధించి ఆర్‌జేడీ అధినేత, తేజస్వి తండ్రి లాలూ యాదవ్‌ను మార్చి 7న సీబీఐ ప్రశ్నించడంతో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. లాలూ భార్య, బీహార్ మాజీ సీఎం రబ్రీ దేవిని కేంద్ర ఏజెన్సీ పాట్నా నివాసంలో ప్రశ్నించింది. సీబీఐ విచారణ తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సైతంఈ కేసులో ఇన్వాల్వ్ అయింది. ల్యాండ్ అండ్ జాబ్స్ కుంభకోణంలో కొనసాగుతున్న విచారణలో భాగంగా మార్చి 10 న ఢిల్లీలోని తేజస్వి యాదవ్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. అందులో భాగంగా లాలూ యాదవ్ ముగ్గురు కుమార్తెలు, ఇతర ఆర్జేడీ నాయకుల ఇళ్లతో సహా ఢిల్లీ, బీహార్‌లోని అనేక ఇతర ప్రాంతాలపైనా ఈడీ దాడులు చేసింది. అంతకుముందు లాలూ యాదవ్, రబ్రీ దేవితో పాటు మరో 14 మందిపై నేరపూరిత కుట్ర, అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల కింద సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో వారందరికీ ఢిల్లీ కోర్టు బెయిల్ కూడా మంజూరు చేసింది. లాలూ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అభ్యర్థులు నుంచి భూములు లాక్కున్నారన్న ఆరోపణ ఆయనపై ఉంది.

## విద్యుత్ భారం లేకుండా టారిఫ్

**అమరావతి, మార్చి 25 (సమసమాజం):** 2023-24కి సంబంధించిన విద్యుత్ టారిఫ్‌ను ఏపీ ఈఆర్సీ ఛైర్మన్ , రిటైర్డ్ జస్టిస్ సీవి. నాగార్జునరెడ్డి విడుదల చేశారు. ఆర్థిక అవసరాలపై డిస్కంలు ఇచ్చిన టారిఫ్ ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి టారిఫ్‌పై నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. 3 డిస్కంలకు అందులో రైతులకు ఫ్రీ కరెంట్, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకు ఇస్తున్న సబ్సిడీ.. ఆక్వా రంగం, నాయీ బ్రాహ్మణలకు ఇస్తున్న విద్యుత్ రాయితీలు కలిపి ప్రభుత్వం సబ్సిడీగా ఇచ్చే విద్యుత్ వల్ల 10,135 కోట్ల ఆదాయ లోటు వచ్చిందన్నారు. ఎనర్జి ఇంటెన్సివ్ ఇండస్ట్రీస్ కంపెనీలకు ఇచ్చే హెచ్‌టీ వినియోగదారులకు మాత్రం కిలోవాట్‌కు 475 రూపాయల అదనపు డిమాండ్ ఛార్జీల ప్రతిపాదనను అంగీకరించామన్నారు. మిగతా పెంపు ప్రతిపాదనలు తిరస్కరించామన్నారు.



# టెండూల్కర్ రికార్డు అధిగమించడం అసాధ్యం

## కోహ్లీకి కూడా సాధ్యం కాదన్న రవిశాస్త్రి

**ముంబై,మార్చి25(సమసమాజం):** ప్రపంచ క్రికెట్ లెజండ్ సచిన్ తెందుల్కర్ నెలకొల్పిన 100 సెంచరీల మైలురాయినిప్రస్తుత తరం క్రికెటర్లలో ఎవరైనా అధిగమించగలడా? అంటే ముందుగా గుర్తొచ్చే పేరు విరాట్ కోహ్లీ. దాదాపు మూడేళ్ల తర్వాత టెస్టు ఫార్మాట్‌పై ఆస్ట్రేలియాపై సెంచరీ చేయడంతో మరోసారి ఈ టాపిక్ తెరపైకి వచ్చింది. కోహ్లీ మునిపటి ఫామ్‌లోకి వచ్చినట్టు కనిపిస్తుండడంతో సచిన్ తెందుల్కర్ 100 శతకాల రికార్డును చేరుకోగల సామర్థ్యం అతడికి ఉందంటూ చాలామంది మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు చెబుతు న్నారు. ఇదే విషయంపై మాజీ క్రికెటర్, మాజీ కోచ్ రవి శాస్త్రి కూడా తన అభిప్రాయాన్ని చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించడం కోహ్లీకి అంత సులభం కాదని వ్యాఖ్యానించాడు. ఒకవేళ ఈ మైలురాయిని చేరుకుంటే చాలా పెద్ద విషయం అవుతుందని రవిశాస్త్రి పేర్కొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఒక్క వ్యక్తి మాత్రమే 100 సెంచరీలు కొట్టాడనే విషయాన్ని ప్రతిఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలి. కాబట్టి, ఇంకెవరో ఈ రికార్డును అధిగమిస్తారని చెప్పడం చాలా పెద్ద విషయం అవుతుంది. ఆడడానికి కోహ్లీ చాలా క్రికెట్ ఉంది. ఫిట్ ప్లేయర్, ఆడగలడు. త్వరత్వరగా సెంచరీలు బాదేశాడు. నా దృష్టిలో విరాట్ కోహ్లీ ఇంకా 5-6 సంవత్సరాలపాటు క్రికెట్ ఆడగలడు. అయితే 100 సెంచరీలను ఊహించకోవడం అంత సులభం కాదు. అందుకే ఇప్పటివరకు ఒక్కడు మాత్రమే సాధించాని రవిశాస్త్రి అన్నాడు. కాగా 1205 రోజుల తర్వాత విరాట్ కోహ్లి టెస్టుల్లో ఇటివల ఆస్ట్రేలియాపై అహ్మదాబాద్ టెస్టులో సెంచరీ కొట్టాడు. టెస్ట్ ఫార్మాట్‌లో అతడికిది 28వ సెంచరీ కాగా.. అంతర్జాతీయ కెరీయర్‌లో 75వ సెంచరీ పూర్తి చేసినట్టయ్యింది. కాగా టెస్టుల్లో చివరి శతకం పూర్తి చేయడానికి కోహ్లీకి ఏకంగా 41 ఇన్నింగ్స్ పట్టింది. చివరిసారిగా నవంబర్ 2019లో బంగ్లాదేశ్‌పై టెస్టు సంచరీ నమోదు చేసిన విషయం తెలిసింది. కాగా మార్చి 31 నుంచి ఆరంభం కానున్న ఐపీఎల్2023లో విరాట్ కోహ్లీ ఆడబోతున్నాడు.

# మొత్తం 13 మ్యాచ్‌ల్లో మ్యాచ్ ఫిక్సింగ్‌లు

## అంతర్జాతీయ క్రీడా సంస్థ స్పోర్ట్స్ రాడార్ వెల్లడి




న్యూఢిల్లీ,మార్చి25(ఆర్ఎన్ఎ): 2022లో జరిగిన ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌లలో మొత్తం13 మ్యాచ్‌లు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లుగా అంతర్జాతీయ క్రీడా సంస్థ స్పోర్ట్స్ రాడార్ ఓ నివేదికలో తెలిపింది. అయితే ఈమ్యాచ్ లు ఇండియా వేదికగా జరగలేదని స్పష్టం చేసింది. స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ తన నివేదికలో క్రికెట్ తో పాటుగా ఇతర గేమ్ లలో కూడా మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లుగా తెలిపింది. 92 దేశాల్లో నిర్వహించిన ఈ నివేదికలో 12 క్రీడాంశాలకు సంబంధించిన మ్యాచ్‌లు ఉన్నాయి. గతేడాది మొత్తంగా వివిధ క్రీడలకు చెందిన 1,212 మ్యాచ్ లపై అనుమానాలున్నాయని తెలిపింది. ఇందులో అత్యధికంగా ఫుట్‌బాల్ మ్యాచ్ లు 775 ఉండటం గమనార్హం. ఫుట్‌బాల్ తరువాత బాస్కెట్ బాల్ ఉంది. ఈ గేమ్ లో 220 మ్యాచ్ లు ఫిక్స్ అయినట్టుగా రాడార్ తెలిపింది. మూడో స్థానంలో ఉన్న టెన్నిస్ ఉన్నట్టుగా వెల్లడించింది. ఇక దేశాల వారిగా చూసుకుంటే అత్యధికంగా యూరప్ ఖండంలో ఏకంగా 630 మ్యాచ్ లు అనుమానాస్పదంగా జరిగాయని తెలిపింది. ఆ తరువాత ఆసియా (240), సౌత్ అమెరికా (225), ఆఫ్రికా (93), నార్త్ అమెరికా (24) లు ఉన్నాయని పేర్కొంది. 2021తో పోలిస్తే గతేడాది మ్యాచ్ ఫిక్సింగ్ లు 34? పెరిగాయని వెల్లడించింది. 2021లో ఈ తరహా మ్యాచ్ లు 905 నమోదైతే.. 2022లో అవి 1212కు చేరుకున్నాయి. మొత్తం బెట్టింగ్ టర్నోవర్ పరంగా ఐపీఎల్ 135 మిలియన్ల టర్నోవర్‌తో ప్రపంచంలో 4వ అతిపెద్ద పోటీగా ఉంది. మొత్తంమీద 67 బిలియన్ల బెట్టింగ్ టర్నోవర్ అంచనాతో క్రీడల పరంగా క్రికెట్ ఐదవ స్థానంలో ఉంది.

# క్రికెట్‌లో మరో షాక్

## పాక్‌ను మట్టి కరిపించిన అఫ్ఘాన్



షార్జా,మార్చి25(ఆర్ఎన్ఎ): ఇప్పుడిప్పుడే క్రికెట్ లో ఎదుగుతున్న అఫ్ఘానిస్థాన్ జట్టు పాకిస్థాన్ కు బిగ్ షాకిచ్చింది. మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరుజట్ల మధ్య షార్జా వేదికగా మార్చి 25న జరిగిన తొలి టీ20 మ్యాచ్ లో అఫ్గానిస్థాన్ జట్టు 6 వికెట్ల తేడాతో ఓడించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణిత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 92 పరుగులు మాత్రమే చేసింది. బాబర్ అజామ్, మహమ్మద్ రిజ్వాన్ లేకుండా బరిలోకి దిగిన పాక్.. అఫ్గాన్ బౌలర్ల ధాటికి విలవిల్లాడింది. దీంతో 92 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన అఎ÷-గానిస్థాన్ జట్టు మరో 6 వికెట్లు, 13 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేధించింది. అఎ÷-గానిస్థాన్‌ను మహమ్మద్ నబీ (38), నజీబుల్లా జద్రాన్ (17) నిలకడగా ఆడి గెలిపించారు. పాకిస్థాన్ పై అఎ÷-గానిస్థాన్ కు ఇదే తొలి విజయం కావడం విశేషం. ముమ్మందు ఇదే జోరును కొనసాగిస్తామని అఎ÷-గానిస్థాన్ జట్టు కెప్టెన్ రషీద్ ఖాన్ వెల్లడించాడు.

# మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్

## పసిడి పతకం నెగ్గిన నీతూ



న్యూఢిల్లీ,మార్చి25(ఆర్ఎన్ఎ): 2023 మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 22 ఏళ్ల భారత బాక్సర్ నీతూ గంగాస్ సత్తా చాటింది. శనివారం జరిగిన ÷నైల్లో మంగోలియా బాక్సర్ లుత్సాయిఖాన్ అట్లాంట్సెట్‌సెగ్‌ను 5-0 తేడాతో మట్టి కరిపించి పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మహిళల 48 కిలోల విభాగంలో నీతూ తన పంచ్ పవర్ చూపించి ఈ ఘనత సాధించింది. క్వార్టర్ ÷నైల్‌లో జపాన్‌కు చెందిన వడా మడోకాను మట్టికరిపించి సెమీస్‌లో అడుగుపెట్టింది. సెమీస్‌లో అలువా బెల్కిబెకోవాపై 5-2 తేడాతో ఘన విజయాన్ని నమోదు చేస్సి ÷నైల్లో ప్రవేశించింది.






# నాని దసరాకు 36 కట్స్

నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తోన్న మాసియస్ట్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'దసరా' చిత్రానికి యుబైఏ సర్టిఫికేట్ జారీ చేసినట్లుగా సమాచారం. అయితే దీనిని వీక్షించిన సెన్సార్ బోర్డు **36** కట్స్ విధించినట్లు తెలుస్తోంది. నాని సరసన కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మించారు. ఈ చిత్రం **30**న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో గ్రాండ్‌గా విడుదలకాబోతోంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని యుబైఏ సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అయితే సెన్సార్ నుంచి మాత్రం ఈ చిత్రానికి షాక్ ఎదురైనట్లుగా తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేని విధంగా.. ఈ సినిమాకు కట్స్ విధించడంతో.. ప్రస్తుతం ఈ విషయంలో 'దసరా' టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీ అవుతోంది.ఈ సినిమా చూసిన సెన్సార్ సభ్యులు మొత్తంగా **36** కట్స్‌తో పాటు.. కొన్ని బూతు పదాలను మ్యూట్ చేయాలని, అలాగే ధూమపానం, మద్యపానంకు సంబంధించి వచ్చే డిస్÷-లకైమర్ ఫాంట్‌ను పెద్ద సైజ్‌లో చూపించాలని సూచించినట్లుగా తెలుస్తోంది. అంతేకాదు, హింసాత్మక సన్నివేశాలను సీజీతో కవర్ చేయాలని సూచిస్తూ.. చిత్రానికి యుబైఏ సర్టిఫికేట్ జారీ చేసినట్లుగా సమాచారం. వాస్తవానికి ఈ చిత్ర టీజర్, ట్రైలర్ చూస్తుంటేనే.. ఇది ం సర్టిఫికేట్ సినిమా అని తెలుస్తుంది. హింసతో పాటు మద్యపాన మోతాదు ఎక్కువగా ఉన్నట్లుగా అర్థమైంది. కానీ యుబైఏ నిమిత్తం.. సెన్సార్ పలు కండీషన్స్ విధించినట్లుగా తెలుస్తోంది. అందులో భాగంగానే ఫస్టాఫ్ **20**, సెకండాఫ్‌లో **16**.. మొత్తంగా **36** కట్స్‌ని బోర్డు విధించినట్లుగా టాక్ నడుస్తోంది. తెలంగాణకు చెందిన సింగరేణి సమీపాన ఉండే వీర్లపల్లి గ్రామం నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి.. సెన్సార్ సూచించిన ఈ కట్స్ జాబితా చూసి చిత్రయూనిట్ కూడా షాక్ అయిందట. సెన్సార్ బోర్డు సూచించిన కటింగ్ సన్నివేశాలన్నీ పోగా.. చిత్ర నిడివి **2** గంటల **39** నిమిషాలకు లాక్ చేసినట్లుగా సమాచారం. అయితే సినిమాపై, నాని నటనపై మాత్రం సెన్సార్ సభ్యులు ప్రశంసలు కురిపించారని తెలుస్తోంది. ఊర మాస్ పాత్రలో నాని విశ్వరూపం చూడబోతున్నారనేలా సెన్సార్ నుంచి వచ్చిన టాక్‌తో నాని ఫ్యాన్స్ (ఔజీనితి ఈజీనిబ) ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఇన్ని కట్స్, మ్యూట్స్ తర్వాత.. 'దసరా' సినిమా ఎలా ఉండబోతోందో.. ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో తెలియాలంటే మాత్రం.. మార్చి **30** వరకు వెయిట్ చేయక తప్పదు. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు.



# అఖిల్ ఏజెంట్ నుంచి సాంగ్ విడుదల

అక్కినేని అఖిల్ ఎన్నో ఎళ్ళుగా కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురు చూస్తున్నాడు. గతేడాది 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'తో హిట్టు సాధించినా.. కమర్షియల్‌గా సక్సెస్ సాధించలేకపోయాడు. ప్రస్తుతం ఈయన ఆశలన్ని 'ఏజెంట్' సినిమాపైనే ఉన్నాయి. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతుంది. ఈ చిత్రంలో అఖిల్ రా ఏజెంట్‌గా కనిపించనున్నాడు. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై ఎక్కడలేని అంచనాలు క్రియేట్ చేశాయి. ఇక ఈ సినిమాను ఏప్రిల్ 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ఇదివరకే ప్రకటించారు. ఈ క్రమంలో మేకర్స్ వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తున్నారు. తాజాగా మేకర్స ఈ సినిమాలోని ఏందే ఏందే అంటూ సాగే మెలోడియస్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. తెలంగాణ మాండలికంలోని లిరిక్స్ శ్రోతలను ఆకట్టుకుంటున్నాయి. హిప్ హప్ తమిళ తన స్టైల్‌లో మంచి క్రిస్పీ ట్యూన్‌ను కంపోజ్ చేశాడు. అంతే క్యాచీగా పద్మలత, సంజిత్ హెగ్డేతో కలిసి పాటలను ఆలపించాడు. ఆస్కార్ గ్రహిత చంద్రబోస్ ఈ పాటకు సాహిత్యం అందించాడు. ఇప్పటికే రిలీజైన మళ్లీ మళ్లీ సాంగ్ ఇన్‌స్టాంట్‌గా ఎక్కేసింది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో మలయాళ స్టార్ మమ్ముట్టి కీలకపాత్ర పోషించాడు. ఏకే ఎంటర్టంల్గ÷నమెంట్స్ బ్యానర్‌తో కలిసి సురేందర్ రెడ్డి స్వీయ నిర్మాణంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. అఖిల్‌కు జోడీగా సాక్షీ వైద్య నటిస్తుంది. తెలుగుతో పాటు తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు.




# 28న రావణాసుర ట్రైలర్ విడుదల

మాస్ మహారాజ రవితేజ బ్యాక్ టు బ్యాక్ హిట్లతో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. గతేడాది చివర్లో 'ధమాకా' అంటూ బాక్సాఫీస్ దగ్గర పటాసులు పేల్చిన రవన్న.. ఈ ఏడాది 'వాల్తేరు వీరయ్య'తో మరో హిట్ ఖాతాలో వేసుకున్నాడు. మెయిన్ హీరో చిరునే అయినా.. సినిమా సక్సెస్‌లో సగం క్రెడిట్ రవితేజకే దక్కింది. ప్రస్తుతం రవితేజ హ్యాట్రిక్‌పై కన్నేశాడు. ఆయన హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో 'రావణాసుర' అనే యాక్షన్ థ్రిల్లర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యాడు. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై ఎక్కడలేని అంచనాలు క్రియేట్ చేశాయి. ఇక సినిమాలోని పాటలైతే ఇన్‌స్టాంట్‌గా ఎక్కేశాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in